
సాక్షి నల్లగొండ

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



వాహనాల రద్దీ

హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. - IIలో



హామీని నిలబెట్టుకోవాలి

అలైన్‌మెంట్ మారుస్తామని ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని జహంగీర్ డిమాండ్ చేశారు. - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	587.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	5,21,842 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	5,17,703 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	32,439 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,023 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నేడు మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ : మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ప్రతి రెండేండ్లకోసారి సెప్టెంబర్ చివరి ఆదివారం పాలకవర్గానికి ఎన్నిక నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. 2025–27 నూతన కార్యవర్గ ఎన్నికల్లో 90 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి –1, 2, కోశాధికారి పదవులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఆదివారం ఉదయం 10గంటలకు మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఎన్నికల అధికారిగా కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ పందిరి రవీందర్ వ్యవహరించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల నామినేషన్ల ప్రక్రియ, మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. 3గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటిస్తారు. ఏ స్థానానికి ఎవరెవరు పోటీ చేస్తారో అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది.

మహిళలంతా సంఘాల్లో చేరాలి



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

నకిరేకల్ : మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నందురు వారంతా స్వయం సహాయక సంఘాల్లో చేరాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి సూచించారు. నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలోని నర్సరీని శనివారం ఆయన సందర్శించారు. నర్సరీ నిర్వహణ బాగుండడంతో ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవి, వన సేవక్ రాజేష్‌ను సన్మానించారు. ఆయన వెంట ఏపీడీ లక్ష్మీ నర్సింహ, ఏపీఓ రమణయ్య, టీఏలు స్వాతి, రమణ, యాదగిరి, రాధా, కృష్ణ ఉన్నారు.

మదర్ డెయిరీ డైరెక్టర్‌గా మూడోసారి..



కర్నాటి జయశ్రీ

చిట్యాల : మదర్ డెయిరీ డైరెక్టర్‌గా చిట్యాల మండలం వనిపాకల గ్రామానికి చెందిన కర్నాటి జయశ్రీ మూడోసారి విజయం సాధించారు. రంగారెడ్డి జిల్లా హయాత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో మహిళ కోటా స్థానానికి ఆమె డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, సొసైటీ అధ్యక్షులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



పోరాట యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

నల్లగొండ : తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా నల్లగొండలోని మర్రిగూడ బైపాస్ వద్ద ఉన్న బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. తెలంగాణ పౌరుషానికి మారుపేరు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. బాపూజీ పేరుతో నల్లగొండలో ఆడిటోరియం కట్టిస్తామని చెప్పారు. బాపూజీ జయంతి రోజున రూ.2400 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీలు ప్రారంభించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, పొట్లబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

← బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

● చిత్తూ చిత్తూల బొమ్మ..



బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మెప్మా ఉద్యోగులు

బీసీలకు సగం

స్థానిక సంస్థల్లో బీసీలకు 49 శాతం రిజర్వేషన్‌తో భారీగా పెరిగిన సీట్లు

- నాలుగు నుంచి 14కు పెరిగిన జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు
- ఎస్టీ మహిళకు జెడ్పీ పీఠం రిజర్వ్
- స్థానిక రిజర్వేషన్లు ఖరారు చేసిన అధికారులు
- ప్రతి కేటగిరీలో మహిళలకు 50 శాతం సీట్ల కేటాయింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : స్థానిక సంస్థలో బీసీలకు 49 శాతం రిజర్వేషన్‌తో వారికి అగ్రతాంబూళం దక్కనుంది. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలు పెద్ద సంఖ్యలో బీసీలకు రిజర్వ్ అయ్యాయి. గత ఎన్నికల్లో బీసీలకు 4 చొప్పున ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు రిజర్వ్ కాగా.. ఈ సారి 14 స్థానాలు బీసీలకు కేటాయించారు. ఇక, నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వేషన్ ఖరారైంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లను జిల్లా యంత్రాంగం ఖరారు చేసింది. ఎంపీటీసీ, సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లు కూడా రాత్రి వెల్లడయ్యాయి.



తిప్పర్తి : రిజర్వేషన్లపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఎంపీపీ, జెడ్పీటీసీల రిజర్వేషన్ల ప్రకటన

జిల్లాలో 33 మండలాలు ఉన్నాయి. వాటిల్లో 5 స్థానాలు ఎస్టీలకు, 6 స్థానాలు ఎస్సీలకు కేటాయించారు. బీసీలకు 14 స్థానాలను ఖరారు చేశారు. ఇవి పోగా అన్‌రిజర్వుడ్ 8 స్థానాలు ఉంటాయి. అందులో ప్రతి రిజర్వేషన్‌లో 50 శాతం స్థానాలకు మహిళలకు కేటాయించారు. దీంతో జిల్లాలో 33 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో 16 చొప్పున స్థానాలను మహిళలకు కేటాయించారు. ఎస్టీ రిజర్వ్ స్థానాలు 5 ఉండగా.. మహిళలకు 2 కేటాయించారు. ఎస్సీ రిజర్వ్ స్థానాలు 6 ఉండగా 3 మహిళలకు, బీసీ రిజర్వుడ్ స్థానాలు 14 ఉండగా 7 మహిళలకు, అన్ రిజర్వుడ్ స్థానాలు 8 ఉండగా 4 మహిళలకు ప్రత్యేకంగా కేటాయించారు. ఆయా రిజర్వేషన్ కేటగిరీల్లో మహిళలకు పోగా మిగిలిన రిజర్వుడ్, జనరల్ స్థానాల్లో పురుషుడు లేదంటే మహిళలకు పోటీ చేసే అవకాశం ఉంటుంది.

జెడ్పీ చైర్మన్ అయ్యేది ఈ నియోజకవర్గాల నుంచే..

జెడ్పీ చైర్మన్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. అయితే జిల్లాలో ఎస్టీలకు 5 జెడ్పీటీసీ స్థానాలు కేటాయించారు. అందులో దేవరకొండ నియోజకవర్గంలోని దేవరకొండ (ఎస్టీ జనరల్), గుండ్లపల్లి (ఎస్టీ మహిళ), కొండమల్లేపల్లి (ఎస్టీ జనరల్), పీఏపల్లి (ఎస్టీ జనరల్), నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర (ఎస్టీ మహిళ)కు రిజర్వ్ అయ్యాయి. ఈ స్థానాలనుంచి పోటీ చేసే గిరిజన మహిళలే జెడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకోనున్నారు.

మండలాల వారీగా రిజర్వేషన్లు ఇలా..

మండలం	జెడ్పీటీసీ	ఎంపీపీ
అడవిదేవులపల్లి	జనరల్ మహిళ	జనరల్ మహిళ
అనుముల	బీసీ మహిళ	బీసీ మహిళ
చందంపేట	జనరల్	జనరల్
చండూరు	జనరల్ మహిళ	జనరల్
చింతపల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్
చిట్యాల	జనరల్	జనరల్
దామరచర్ల	జనరల్	జనరల్
దేవరకొండ	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
గట్టుప్పల్	బీసీ జనరల్	బీసీ మహిళ
గుడిపల్లి	బీసీ మహిళ	బీసీ మహిళ
గుండ్లపల్లి	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
గుర్రంపోడు	బీసీ జనరల్	బీసీ మహిళ
కనగల్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
కట్టంగూర్	ఎస్సీమహిళ	ఎస్సీ మహిళ
కేతేపల్లి	బీసీ జనరల్	బీసీ మహిళ
కొండమల్లేపల్లి	ఎస్టీ జనరల్	ఎస్టీ జనరల్
మాడ్గులపల్లి	బీసీ మహిళ	బీసీ జనరల్
మర్రిగూడ	బీసీ మహిళ	బీసీ మహిళ
మిర్యాలగూడ	బీసీ మహిళ	బీసీ జనరల్
మునుగోడు	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
నకిరేకల్	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
నల్లగొండ	బీసీ మహిళ	బీసీ మహిళ
నాంపల్లి	బీసీ మహిళ	బీసీ జనరల్
నార్కట్‌పల్లి	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
నేరడుగొమ్ము	జనరల్ మహిళ	జనరల్ మహిళ
నిడమనూరు	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
పీఏపల్లి	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
పెద్దవూర	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
శాలిగౌరారం	బీసీ జనరల్	బీసీ జనరల్
తిప్పర్తి	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
తిరుమలగిరిసాగర్	జనరల్	జనరల్ మహిళ
త్రిపురారం	బీసీ జనరల్	బీసీ జనరల్
వేములపల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : ఇళ్లు లేని పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని అన్నారెడ్డిగూడెం గ్రామానికి చెందిన 69 మంది లబ్ధిదారులకు శనివారం ఆయన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలు గుడిసెల్లో నివాసం ఉండొద్దని.. ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తున్నామన్నారు. అన్నారెడ్డిగూడెం గ్రామానికి 17 ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పొందిన లబ్ధిదారులు ఆ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్, రంగులు వేసుకోవాలని, దీపావళిలోపు గృహప్రవేశాలు చేయాలని, ఇందుకుగాను ప్రతి ఇంటికి తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అన్నారెడ్డిగూడెం నుంచి తొరగల్లు వరకు రూ.2 కోట్లతో రోడ్డు వేయనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.5 లక్షల 4 వేలతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పారదర్శకంగా కేటాయించామన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ పీపీ రాజ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆఫీజ్ ఖాన్, తహసీల్దార్ పరశురాం, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గృహప్రవేశాలు



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఫొటో దిగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కనగల్ : మండల పరిధిలోని తెలకంటిగూడెంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలోకి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయించారు. లబ్ధిదారులకు పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామానికి 107 ఇళ్లు మంజూరు కాగా.. 10 ఇళ్ల నిర్మాణం పూర్తికావడంతో గృహ ప్రవేశం చేశారని మంత్రి తెలిపారు. తేలకంటిగూడెం గ్రామానికి వారం, పది రోజుల్లో రేషన్‌దుకాణం ఏర్పాటు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. తేలకంటిగూడెం నుంచి ధర్వేశిపురం కలిపే రహదారి వరకు తారు రోడ్డును రూ.25 కోట్లతో మంజూరు చేశామన్నారు. గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, ఎల్ఈడీ లైట్లు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ పద్మ, ఎంపీడీఓ సుమలత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కూసుకుంట్ల రాజిరెడ్డి, గుండెబోయిన భిక్షం, బోగారి రాంబాబు, బిల్లపాటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు



భీమారం వద్ద వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

● ప్రాజెక్టు తొమ్మిది గేట్లు ఎత్తివేత

కేతేపల్లి : నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగు నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు శనివారం వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టు తొమ్మిది క్రస్టుగేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. హైదరాబాద్, జనగాం, ఆలేరు, వరంగల్ తదిరత ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో బిక్కేరు, వసంతవాగు, మూసీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుయి. ఆయా వాగుల ద్వారా శనివారం సాయంత్రం వరకు మూసీ రిజర్వాయర్‌లోకి 41,324 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో 643.70 అడుగుల వద్ద నీరు ఉంది. మూసీకి ఇన్‌ఫ్లో భారీగా వస్తుండటంతో అధికారులు ప్రాజెక్టు ఎనిమిది క్రస్ట్ గేట్లను ఎనిమిది అడుగులు, ఒక గేటును ఆరు అడుగులు (మొత్తం 9గేట్లు) పైకెత్తి 44,547 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. మూసీ కుడి, ఎడమ కాల్వలకు 190 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

భీమారం వద్ద నిలిచిన రాకపోకలు..

మూసీ ప్రాజెక్టు 9 గేట్లను ఎత్తడంతో కేతేపల్లి మండలం భీమారం–సూర్యాపేట మధ్య భీమారం శివారులో మూసీవాగుపై నిర్మించిన లోలెవల్ వంతెన వరదనీటిలో మునిగిపోయింది. వంతెన మీదుగా నాలుగు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో మిర్యాలగూడ నుండిచి వయా భీమారం మీదుగా సూర్యాపేటకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సూర్యాపేట – మిర్యాలగూడ పట్టణాల మధ్య నడిచే ఆర్టీసీ బస్సులను అధికారులు వయా ఉప్పలపహాడ్, కొప్పోలు గ్రామాల మీదుగా దారి మళ్లించారు. వంతెనపైకి వాహనాలు వెళ్లకుండా కేతేపల్లి పోలీసులు, రెవెన్యూ అధికారులు పికెట్ ఏర్పాటు చేశారు. వంతెనపై వరద ప్రవాహాన్ని తహసీల్దార్ రమాదేవి, ఎస్ఐ సతీష్ పరిశీలించారు.

రైతుల భూములు లాక్కోవద్దు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని కోల్పోతే పరిహారం ఏం ఇస్తారో ఇప్పటికీ చెప్పడం లేదన్నారు. అందుకే భూమిని ఇవ్వడానికి రైతులు సిద్ధంగా లేరని చెప్పారు. రైతుల ఆమోదం లేకుండా భూమిని తీసుకోవడం సరి కాదన్నారు. రైతులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, చిన్నపాక లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, మల్లం మహేష్, కొండ అనురాధ, రైతులు పాల్గొన్నారు.



లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

కనగల్ : మండలంలోని ధర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి అర్చకులు పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డి, సిబ్బంది చంద్రయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి, అర్చకులు నాగోజు మల్లాచారి, చిలకమర్రి శ్రవణ్ కుమారాచార్యులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు దసరా జోష్

- జీఎస్టీ స్లాబ్‌ల కుదింపుతో కాస్త తగ్గిన ధరలు
- ఊపందుకున్న వ్యాపారాలు
- పండుగ ఆఫర్లతో పెరిగిన వాహన కొనుగోళ్లు
- తగ్గిన ధరలతో చిరు ఉద్యోగులు, మధ్యతరగతి వర్గాలకు ఊరట



నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డులో వాహనాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



ఎస్పీటీ మార్కెట్ కొనుగోలుదారులతో రద్దీ

రామగిరి(నల్లగొండ), సూర్యాపేట అర్బన్ : దసరా పండుగ వేళ వివిధ వ్యాపార మార్కెట్లలో సందడి నెలకొంది. ముఖ్యంగా జీఎస్టీ స్లాబ్‌లను కుదించి తాజాగా కొత్త సంస్కరణలు తేవడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. దీనికితోడు పండుగ సందర్భంగా వివిధ షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ భారీ డిస్కౌంట్లతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. దీంతో కొత్త వస్త్రాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు చేసేందుకు వినియోగదారుల ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆయా మార్కెట్లలో పండుగ అమ్మకాలు జోరందుకున్నారు.

జీఎస్టీలో రెండు స్లాబ్‌లు..

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో పేద, మధ్యతరగతి వర్గాలతోపాటు చిరు ఉద్యోగులకు ఊరట లభించింది. ఇప్పటివరకు 5, 12, 18, 28 శాతం పన్ను స్లాబ్‌లు అమలులో ఉండగా తాజా సంస్కరణలతో 5, 18 శాతం వరకు ఒకటి, 40 శాతం వరకు రెండో స్లాబ్‌గా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో కార్లు, టీవీలు, బైక్‌లు, కుక్కర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టడంతో వాటి అమ్మకాలు జోరందుకున్నాయి.

ధరల తగ్గుదల ఇలా..

జీఎస్టీ కొత్త స్లాబ్‌లు అమలులోకి రావడంతో వ్యాపారాలు జోరందుకున్నాయి. టీవీలపై గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీ నుంచి 18 శాతానికి కుదించడంతో 34 నుంచి 65 ఇంచుల సైజులో ఉన్న టీవీల ధరలు రూ.4వేల నుంచి రూ.6వేల వరకు తగ్గాయి. ఏసీలపై 18 శాతానికి మార్చడంతో టన్నున్నర నుంచి రెండు టన్నుల కెపాసిటీ ఏసీలపై రూ.5వేల నుంచి రూ.9వేల వరకు ధరలు దిగి వచ్చాయి. 12 శాతం ఉన్న ప్రెషర్ కుక్కర్ జీఎస్టీ 5శాతానికి మారడంతో రూ.200 నుంచి రూ.400 వరకు ధరలు తగ్గాయి. ద్విచక్ర వాహనాలపై ఇప్పటి వరకు 28 శాతం జీఎస్టీ ఉండగా ప్రస్తుతం 18 శాతం స్లాబ్‌కు మార్చడంతో 125 సీసీ నుంచి 155 సీసీ వరకు రూ.9వేల నుంచి రూ.17వేల వరకు తగ్గుముఖం పట్టాయి. దీంతో బైక్‌ల కొనుగోళ్లు ఒక్కసారిగా పెరిగాయి. ఇక జీఎస్టీ మార్పుతో చిన్న కార్ల రేట్లు తగ్గించగా, భారీ కార్లు, లగ్జరీ వాహనాలపై పెంచింది. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, సీఎన్‌జీ కార్లపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గింది. దీంతో చిన్న కార్ల ధరలు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు తగ్గాయి. ఎలక్ట్రికల్ వాహనాలకు 5 శాతం పాత జీఎస్టీనే కొనసాగుతోంది. రేట్లు తగ్గడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఈసారి వాహనాల కొనుగోలు పెరిగిందని షోరూమ్ యజమానులు చెబుతున్నారు.

ఆఫర్లు, డిస్కౌంట్లు..

దసరా పండుగ వేళ వివిధ షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ స్టోర్స్ అన్నీ స్పెషల్ క్యాష్‌బ్యాక్ వంటి ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాయి. ఫ్యామిలీ షాపింగ్, పండుగ డెకరేషన్ కోసం కొత్త ఐటమ్స్‌కు డిమాండ్ బాగా పెరిగింది. మొబైల్స్‌ను ఆన్‌లైన్‌లో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. పండుగ షాపింగ్‌తో జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో షాపింగ్ మాల్స్ కిక్కిరిసి పోతున్నాయి.

కాస్త ఉపశమనమే..

జీఎస్టీ సంస్కరణలతో కుక్కర్లు, టీవీల ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సామాన్యులు సైతం వాటిని సులభంగా కొనుగోలు చేయగలిగే అవకాశం లభించింది. ఈ మార్పు చిరు ఉద్యోగులు, కూలీలు, స్వయం ఉపాధి చేసుకునే వర్గాలకు ఉపశమనమేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు. అయితే సిగరెట్లు, గుట్కా, పాన్ మసాలాలపై మాత్రం 40 శాతం పన్ను కొనసాగింపుపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

అమ్మకాలు పెరిగాయి



గత నెలతో పోల్చితే ఈ నెలలో కార్ల విక్రయాలు బాగా పెరిగాయి. జీఎస్టీ రేట్ల మార్పు, దసరా పండుగ రెండూ కలిసి వచ్చాయి. జీఎస్టీ తగ్గించడంతో ఒక కారుపై సుమారు రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు రేట్లు తగ్గాయి.

– పి.క్రాంతికిరణ్, హ్యుందయ్ జనరల్ మేనేజర్

క్లుప్తంగా

యాదగిరిగుట్ట ఆలయానికి ఎక్సలెన్స్ అవార్డు



సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఈఓ రవి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం తెలగాణ టూరిజం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైంది. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఆలయ ఈఓ జి. రవి ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు గజవెల్లి రఘు, జూశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

స్థపతి శ్యాంసుందర్‌కు..


అవార్డు అందుకుంటున్న శ్యాంసుందర్‌రావు

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం మీడియా, ప్రమోషన్స్ మేనేజర్, స్థపతి దేశరాజు శ్యాంసుందర్‌రావు టూరిజం అవార్డు అందుకున్నారు. తెలంగాణ చారిత్రక పర్యాటకం అనే అంశంపై బాలచెలిమి మాసపత్రికలో శ్యాంసుందర్‌రావు రాస్తున్న వ్యాసాలకు గాను శనివారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సాయం

మునుగోడు: మునుగోడు మండలం కోతులారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కుమారుడు రిషి(ఏడాది లోపు వయస్సు) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని శుక్రవారం మునుగోడుకు వచ్చిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు చెప్పగా.. ఆయన ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల నగదును కుటుంబ సభ్యులకు పంపించారు. ఆస్పత్రి ఖర్చులన్నీ తానే అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక కోర్సులతో ఉద్యోగావకాశాలు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండ పట్టణంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

నల్లగొండ: సాంకేతిక కోర్సుల్లో శిక్షణ పొందడం ద్వారా మంచి ఉద్యోగావకాశాలు పొందవచ్చని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీఐ ప్రాంగణంలో రూ.42.5 కోట్లతో నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2400కోట్లతో 65 ఏటీసీలను వర్చువల్‌గా ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఏటీసీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే మరోవైపు ప్రైవేట్ సెక్టార్‌లో కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. యువత కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించాలన్నారు. పక్కనే ఉన్న న్యాక్ భవనంలో కూడా మహిళలకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. యువత భవిష్యత్ వారి కష్టం మీదే ఆధారపడి ఉంటుందన్నారు. 4 సంవత్సరాలు కష్టపడి చదివితే 40 ఏళ్లు సుఖంగా ఉండవచ్చని అన్నారు. అనంతరం జిల్లా అవార్డు సాధించిన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మంత్రి అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకేషనల్ శిక్షణ ఉంటే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. డిగ్రీ, ఇతర చదువుల ద్వారా మాత్రమే కాకుండా సాంకేతిక విద్య ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవిష్యత్తులో పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఆర్డీఓ అశోక్ రెడ్డి, ఉపాధి కల్పన అధికారి ఎన్. పద్మ, ఏటీసీ ప్రిన్సిపాల్ నర్సింహచారి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ హఫీజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి , కలెక్టర్ ఇలా త్రిపాఠి

● అమెరికాలో బతుకమ్మ వేడుకలు



కనగల్: నల్లగొండకు చెందిన కోమటిరెడ్డి సిరిచందన రెడ్డి ఆధ్వర్యంలో శనివారం అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ పట్టణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. ఈ వేడుకల్లో నల్ల శ్రావణిరెడ్డి, నవ్య, ప్రత్యూష, మౌనిక, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హత్య

- పాత కక్షలతోనే శివకుమార్‌ను హత్య చేసినట్లు నిర్ధారించిన పోలీసులు

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కేసారం రోడ్డులో శుక్రవారం రాత్రి హత్యకు గురైన వ్యక్తిని పథకం ప్రకారమే ప్రత్యర్థులు మట్టుబెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ హత్యలో పాల్గొన్న వారితో పాటు మృతుడు సైతం పాత నేరస్తుడే కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చారగండ్ల శివకుమార్(29)కి ఐదేళ్ల క్రితం పెద్ది లింగస్వామి అనే వ్యక్తితో గొడవ జరిగింది. అప్పట్లో లింగస్వామి శివకుమార్‌పై హత్యాయత్నం చేయగా కేసు నమోదైంది. అప్పటి నుంచి లింగస్వామి శివకుమార్‌పై పగ పెంచుకున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పూల సెంటర్‌లో ఇద్దరి మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. దీంతో ఎలాగైనా శివకుమార్‌ను హతమార్చాలని లింగస్వామి నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే రౌడీషీటర్ మాతంగి మధుతో శివకుమార్‌కు ఫోన్ చేయించి భీమారం రోడ్డులోని కుసుమవారిగూడెం సమీపంలోని మద్యం దుకాణం వద్దకు పిలిపించాడు. అయితే మాతంగి మధు, శివకుమార్ కలిసి గతంలో చిన్న చిన్న పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేసేవారు. ఏడాది క్రితం మాతంగి మధు కోదాడకు చెందిన ఓ వ్యక్తి హత్యకు సుపారీ తీసుకున్నట్లు తేలడంతో పట్టణ పోలీసులు అతడిని బైండోవర్ చేశారు. తాను సుపారీ తీసుకున్న విషయం శివకుమార్ పోలీసులకు చెప్పాడని మధు సైతం అతడిపై పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో వీరంతా కలిసి కుసుమవారిగూడెం సమీపంలో ఉన్న వైన్స్ ఎదురుగా ఉన్న హోటల్‌లో శుక్రవారం రాత్రి మద్యం తాగుతుండగా మాతంగి మధు, పెద్ది లింగస్వామి మరికొంత మంది కలిసి గొడ్డళ్లు, కత్తులతో శివకుమార్‌పై విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చి పరారయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు మాతంగి మధుపై కూసుమంచిలో ఒక హత్య కేసు, సూర్యాపేటలో మూడు హత్యాయత్నం కేసులు, సూర్యాపేటలో మూడు, కేతేపల్లిలో ఒక చోరీ కేసు నమోదై ఉంది. మృతుడికి భార్య అఖిల, కుమారుడు రిష్, కుమార్తె విజయశ్రీ ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట రూరల్ పోలీసులు తెలిపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ నరసింహ

ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

హత్య జరిగిన స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహ శనివారం పరిశీలించారు. డీఎస్పీ, సీఐలతో పాటు స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. నిందితులను త్వరగా అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిందితులను పట్టుకోవడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రూరల్ సీఐ బాలునాయక్ ఉన్నారు.

ఎరువుల దుకాణంపై కేసు నమోదు

హాలియా : ప్రైవేట్ ఏజెన్సీ నుంచి యూరియా తెచ్చుకుని స్థానిక వ్యవసాయ అధికారుల అనుమతి లేకుండా విక్రయించిన ఫర్టిలైజర్ షాపుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఏఓ మల్లేష్ శనివారం తెలిపారు. హాలియా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో గల ప్రియాంక ఫర్టిలైజర్ షాపు యజమాని ఓ ప్రైవేట్ ఏజెన్సీ నుంచి 29 టన్నుల యూరియాను దిగుమతి చేసుకున్నట్లు ఏఓ తెలిపారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు చెప్పకుండా శుక్రవారం రాత్రి విక్రయించడంతో పెద్దఎత్తున రైతులు గొడవ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే ప్రియాంక ఫర్టిలైజర్ షాపు వద్దకు వెళ్లి చూడగా అప్పటికే పెద్ద మొత్తంలో యూరియాను రైతులకు విక్రయించినట్లు ఏఓ తెలిపారు. మిగిలిన 250 బస్తాల యూరియాను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు చిట్టీలు రాసి పంపిణీ చేశామన్నారు. మరో 48 బస్తాల యూరియాను సీజ్ చేసి, షాపు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఓ పేర్కొన్నారు. ఏడీఏ సరిత ఫర్టిలైజర్ షాపు వద్దకు వచ్చి సమాచారం తెలుసుకున్నట్లు తెలిపారు.



హాలియాలోని ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం గుమికూడిన రైతులు

అలైన్‌మెంట్ మారుస్తామనే హామీని నిలబెట్టుకోవాలి


యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు, సీపీఎం నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్
- రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులతో కలిసి యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరిటౌన్ : తాము అధికారంలోకి వస్తే రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మారుస్తామని భువనగిరి, మునుగోడు, ఆలేరు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట రీజినల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులు చేసిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ముందు ప్రకటించిన అలైన్‌మెంట్ కాకుండా.. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 28కి.మీ. దూరానికే రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని కుదించడం వలన పట్టణ, మండల కేంద్రాలకు చేరువలో ఉన్న సారవంతమైన భూములను రైతులు అత్యధికంగా కోల్పోతున్నారని అన్నారు. సాగుకు యోగ్యంకాని భూములను తీసుకోవాలని చట్టం చెబుతున్నా.. కొందరు పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, సంపన్న వర్గాలను కాపాడేందుకు అలైన్‌మెంట్‌ను మార్చి రైతాంగానికి నష్టం కలిగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వందల కుటుంబాలు భూమిలేని నిరుపేదలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో రీజినల్ రింగ్ రోడ్డు అంశాన్ని తమకు అనుకూలంగా వాడుకొని, ఇప్పుడు అధికారంలోకి రాగానే రైతులకు మొండిచేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు ఇచ్చిన హామీ మేరకు భువనగిరి, మునుగోడు, ఆలేరు ఎమ్మెల్యేలు రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్పు చేయించి మాట నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, గుంటోజు శ్రీనివాసచారి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, నాయకులు దొంతగాని పెద్దులు, గంగదేవి సైదులు, మాయ కృష్ణ, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేష్, పల్లెర్ల అంజయ్య, ఈర్లపల్లి ముత్యాలు, గంటపాక శివ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

రాజాపేట : కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రాజాపేట మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం సిరిపురం గ్రామానికి చెందిన దయా భిక్షపతికి ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె రమ్యను 13 సంవత్సరాల క్రితం రాజాపేట మండలం బొందుగుల గ్రామానికి చెందిన బాల్ద శ్రీశైలంకి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమ్య, శ్రీశైలం దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొన్నిరోజులుగా రమ్య తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. కాగా శనివారం ఉదయం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

స్వర్ణగిరీశుడికి వసంతోత్సవ సేవ

భువనగిరి: దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలను భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం క్షేత్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారిని, పద్మావతి అమ్మవారికి అర్చకులు వసంతోత్సవ సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం పద్మావతి అమ్మవారిని ధాన్యలక్ష్మిగా అలంకరించి హోమం చేపట్టారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో వేంకటేశ్వర స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. అదేవిధంగా సాయంత్ర వేళ ఆలయంలో స్వామివారికి, అమ్మవార్లకు తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో పోషకాహారంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

బీబీనగర్: బీబీనగర్ మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాలలో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నర్సింగ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం మహిళలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పద్ధతులు, రక్తహీనత నివారణ, జీవనశైలిలో మార్పులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మోహన సుద్నారితో పాటు వైద్యులు రుణశ్రీ, హరికృష్ణన్, రజిని, జిజాన తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ


చౌటుప్పల్ పట్టణంలో హైవేపై బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వాహనాల రద్దీ నెలకొంది. విద్యాసంస్థలకు దసరా పండుగ సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్ వాసులు స్వగ్రామాలకు వెళ్తుండడంతో ఈ రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఈ రద్దీ కొనసాగింది. వాహనాలు నిదానంగా ముందుకు సాగాయి. సివిల్, ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు శ్రమించారు. చౌటుప్పల్ పట్టణంలోని జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు స్థానిక వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

16 గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు టెయిల్ పాండ్, మూసీ నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. శనివారం రాత్రి వరకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 4,16,720 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 16 గేట్లను ఎత్తి 4,63,136 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

- నల్లగొండ పట్టణం పద్మావతి కాలనీలో మెయిన్ రోడ్ 3000 SFT ఈస్ట్ ఫేస్ (3ఫ్లోర్స్) గల ఇల్లు అమ్మబడును. సంప్ర॥ సెల్ : 9550540116 [SCA25008111]

PLOTS FOR SALE

- Hyd పెద్దఅంబర్‌పేట, హైవేకి అతి దగ్గర 500మీ.దూరం 110 గజాలు (25x36) పడమర దిక్కు Open Plot అమ్మకానికి కలదు.Cell: 7382661947 [SCA25008479]
- Opp MRO Office, MLG, Vidyanagar, North of Medhari Community Hall, Gated Vencher, 30" W/F Road, Plots Nos 35,36, 37,38 Cell : 8074762705 [SCA25007960]

COMMERCIAL

- Commercial Space up to 5000 Sqft. NE Corner Building on Main Road, Opp to Area Hospital, Bhuvanagiri. Ph : 8790311130 / 9701121316 [HA-35460]

భూమి కావలెను

- భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716. [SCA25008551]

Wanted

- Walk in Interview for Electricians, Plumbers, Supervisors. Ph: 7989896938 [HA-15521]
- మిర్యాలగూడ, సూర్యాపేటలో SBS మాడ్యులర్ కిచెన్, కబోర్డ్స్ నందు వర్క్ చేయుటకు 2 వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. 9949445899 [G-1037]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.